



కోటమర్తి చిన రఘుపతిరావు

౧

అది అర్ధరాత్రము. చిమ్మచీకటులు జగమెల్ల కురియుచుండెను. రాత్రి పదికి మునుపే గ్రామమునందలి ప్రజలు భోజనములు పెందలకడ పూర్తి గావించుకొని తమ తలుపులకు గడియలు గడియలపై తాళములు వేసికొనుచుండిరి. వీధియం దార్తారావము వినిపించినను తలుపులుమాత్రము ఎవరును తీయుటలేదు. బయటి వారలకును టి ట్టీ ట్టీ యని తీతువ మాత్రము నడుమ పరామర్శింపుచుండెను. కొన్నిదినముల క్రితమువఱకును గస్తీవాండ్ర యీలధ్వనులు, హెచ్చరికలు, వినబడుచువచ్చెను. కాని వారిలోనుండి గూడ మరణ సంఖ్య పెరుగుట ప్రారంభింపగానే ఆ బహుపరాకులు, హెచ్చరికలు తగ్గిపోయెను. గ్రామమునందు వ్యాపారము సన్నగిల్లినది. ఇరుగుపొరుగు గ్రామములనుండి బంధుగులుగూడ నా గ్రామము రా మానిరి. అంతయు భయమే! అంతయు భీభత్సమే—ఎక్కడజూచిన హత్యలు—ఎక్కడజూచినను వధలే—కారణము మాత్రము యెవరికిని దెలియదు—అరుణశోణిత రక్తప్రవాహములో కొట్టుకొనిపోవు శవములు—మాంసము చర్మము తొలగింపబడిన యస్థి పంజర సముదాయములు—శివుడు తన వేసికంటితో జూచుచు ప్రళయతాండవము జేయుచున్నాడో! ప్రకృతి ప్రళయకాల మేఘ గర్జారవములతో భీభత్సగ సాగి దేవతావల,విజృంభించి వినాశము గలుగజేయుచున్నదో! ప్రజలలో శాంతచిత్తము నశించిపోయినది. ప్రభునిలో హృదయావేగము పెరుగ వచ్చినది—అతడుమాత్ర మేమి చేయగలడు? ప్రభువు ప్రజలను శాంతి పరుపగలడు గాని ప్రళయ ప్రకృతిని—పరమశివుని—శాంతి పరుపగలడా! భయాన్వితులైన ప్రజలను వలస బోకుండ నాపగలడు కాని ప్రభువుమాత్రము ప్రాణములు వలస బోకుండ నాపగలడా! ఎందులకైన నేమి యనుకొని ప్రజాక్షేమమే తన క్షేమముగా నెన్నుకొనిన రాజు యీ దిగువ ప్రకటనము గావించెను. "నా గ్రామములో నిర్భయముగా ప్రవేశించి నిర్దాక్షిణ్యముగా నిరపరాధుల వధించుచున్న హంతకుని బట్టి తెచ్చిన అపరాధ పరిశోధకునకు వేయి వరహాలను, నా కూతును నొసంగెదను." అని ఆ ప్రకటనము వినిన కొంద రాహంతకుల బట్టుకొనుట కుత్సహించినారు. నిరుత్సాహవంతులు కొందరు వారిని వెనుకకు లాగిరి. మొత్తముమీద ఆ ప్రకటనము వినినవా రెవ్వరందులకై ప్రయత్నింపలేదు. ఆ హంతకులు పిండారీలు అని కొందరు. వన్యమృగములని కొందరు. ఎవరైన నేమి? ఆ హంతకు లెవ్వరో యెవరికిని తెలియుటలేదు. తుదకు ప్రజ లా విషయమును తెలిసికొనవలెనని ప్రయత్నించుట లేదు.

## ౨

రాజు ప్రకటనము గావించిన రాత్రి 'యేమైనను సరే నేనా హంతకుని కని పెట్టి తీరుదునని ఆ గ్రామములో కాపురమున్న నొక్క యింటి యజమాని విశ్వ ప్రయత్నము జేసి వీధి తలుపులకు సన్నని రంధ్రము జేసి దాని గుండ వెలుపలకు జూచుటకు ప్రారంభించెను. అతనికి మొట్టమొదట సన్నని యీలధ్వని-పిదప-గజ్జెలచప్పుడు-ఆపైన అట్టహాసము-తదుపరి కోటిసూర్య ప్రభ-అనంతరము, శతరథధ్వానము-క్రమముగా ద్యోతకమయ్యె. ఇది యెల్ల నొక్క త్రుటికాలములో జరిగిపోయినది. ఆ చూచుచున్న యింటి యాజమాని రెండు చెవులు రెండు కన్నులుగూడ చిల్లులు పడిపోయినవి. అతడు తన భార్యను బిలచి యామె సహాయ్యమున లోనికి బోయి జరిగిన యావద్వృత్తాంతము తెలిపెను. ఆ విషయములనెల్ల తెలిసికొని యామె మిగుల విచారించినది. మరి రెండు మూడు దినములలోనే యీ విషయము రాజుగారికి కూడ పూర్ణముగ తెలిసినది. రాజు నిశ్చేష్టితుడయ్యెను. గ్రామ గ్రామములనుండి రక్షకభటుల రావించి గ్రామమంతయు కాపలి బెట్టెను. దేశదేశములనుండి మంత్రవేత్తల రావించి దిగ్బంధనల గావించెను. ఖండ ఖండములనుండి వేదపండితుల రావించి యజ్ఞయాగాది క్రతువుల గావించెను. కాని ప్రతిదినమునందునను గ్రామములో హత్యలు మాత్రము జరుగుట మానలేదు. ఎక్కడనో ఏమూలనో యేరీతినో ఏదో రకముగ నిత్యము హత్య గావింపబడుచునే యుండెను. ఒకనాటి రాత్రి రాజునకు వింత స్వప్నమాయెను. ఆ స్వప్నములో నాతనికి మాటలే గాని వ్యక్తి గానిపింపలేదు. "నన్ను పట్టించెదవా! నన్ను పట్టించెదవా! జాగ్రత్త. నా యపరాధము కనుగొన శక్తుడైన పరిశోధకుడొక్కడనూ లేడు. నన్ను పట్టినవారికి నీ కూతు నిచ్చెదనంటివి. నీ కూతు నాకే నిమ్ము. నేనే బలిగా తీసికొందును. నేటికి వారము దినములలో నీవు నీ కూతుని నిర్దాక్షిణ్యముగా నీ స్వహస్తములతో కోట గుమ్మముకడ వధింపవలెను. తెలిసినదా! లేకున్న నేనే రావలసియుండును. అప్పుడొకటికి రెండు ప్రాణముల దీసికొందును. జాగ్రత్త!! జాగ్రత్త!! జాగ్రత్త!!" అను హెచ్చరికతో నావ్యక్తి యంతర్ధానమయ్యెను. రాజు భయభ్రాంతుడై లేచెను. అప్పటికప్పుడే తూరుపు తెల్లవారుచున్నది.

## ౩

నాడు రాజు పెందలకడ మంత్రుల రావించెను. మంత్రవేత్తల గూఢచారుల బిలిపించెను. అందరి సమక్షమునను తన స్వప్నమును తెల్పెను. ఎవ్వరికేమియు దోపలేదు. స్వప్నగత వృత్తాంతము రాజు దేశ దేశముల వారికిని తెలుపుడు చేసెను. పల్వురు పలు విధములగు నుపాయముల జెప్పిరి. ప్రజా క్షేమము కొఱకు నొక్క ప్రాణము బలినీయరాదా యని కొందరు; వట్టికలకు భయభ్రాంతుడై రాజు ఇంత హడావడి చేయుట న్యాయమా? అని కొందరు తలంప జొచ్చిరి. రాజు భయభ్రాంతుడైనాడను వార్త విని గ్రామస్థులు పెక్కండ్రు తమ నిజనివాసముల వీడి వలస బోవ ప్రారంభించిరి. కొంద రాస్తుల తెగ నమ్ముకొని యీ గ్రామము తిరిగి తమ జన్మలో రాదలచుకొనలేదని నిశ్చయము చేసికొని వెడలిపోయిరి. గ్రామమంతయు శ్మశాన వాటికవలె కనబడజొచ్చెను.

## ౪

వారము దినములు గడువు దగ్గర పడినకొలది గ్రామములో నెక్కడ జూచిన నండావిడియే. ఎక్కడ జూచిన-గబగబలే-ఉరుకులే-పరుగులే-ఎందులకో-ఎక్కడికో-తొందర-అతితొందర-వాయువేగము - మనోవేగము-అచేతనమైన గడియారము టంగుటంగున అతి తొందరలో గంటలు కొట్టుచుండెను. సోమయాజులు కాయలోని పొడుమునంతయు నొక్క మలుపులో నులిపినాడు. తిరువడయ్యంగారు తిరుప్పెరుమాళ్ల సేవ తప్పుడు బియ్య పన్నములో శేరున్నర సాంబారు పోసి తొందరలో నొక్క ముద్దగా నదంతయు మింగివేసినాడు. సెంటు పెరసెంటు టాకీ అయిన అబద్ధమూర్తి అయ్యారు ధజండు పెరసెంటు టాకీగా మారిపోయినాడు. ఇంత తొందరకు కారణమెవ్వరికి తెలియుట లేదు. చేతిలోని నాడికి మడుకు-ముద్దరాలి కన్నులలో జలుగు-వేశ్య కాంత కాలి గజ్జెల పలుకు, తొందర జెందుచుండెను. కారణము మాత్రము తెలియదు. ఒక్కటే ఆదుర్దా. ఒక్కటే హడావడి.

## ౫

రాజున కేమియు తోచుటలేదు. మరునాటితో గడువు దాటిపోవుచున్నదను బెంగ. కూతురున కే

విపత్తు వచ్చునో యని విచారము. ఏమి చేయుటకును చేతులు రావు. ఏమి మాట్లాడుటకు నోరు కదలుట మానివేసినది. ఏమి చూచుటకును కను లంగీకరించుట లేదు. ప్రపంచమంతయు నతని కంధకార బంధురమైనది. తన హృదయకోశధ్వని తన చెవులకు వినబడుచు వచ్చెను. అట్టియెడ నింకాతడేమి చేయగలడు. సర్వమునకు దైవము మీదనే భారము వేసెను.

## ౬

భైరవ నాటిరాత్రి కొ గ్రామ మొక్కడు వచ్చినాడు. వానికి గ్రామము లెవ్వరు పండుకొనుటకు చోటిచ్చినారు కారు. అందుచే నాత డొక వీధి యరుగుపై పండుకొనియెను. నాటి రాత్రి పన్నెండు ఘంటలకొక వ్యక్తి వచ్చెను. కోటి సూర్య ప్రభలతో వెలుగొందు నావ్యక్తి ఆపాంథుడైన బ్రాహ్మణుని చెంతకు జేరినది. ఆ బోడివానిని లేపినది. తనకు బలిగా రమ్మని యతని నాజ్ఞాపించినది. ఆ బలి యను రెండక్షరములు వినిపించుటకై కా బోడిబాపనకు మెలకువ రాలేదు. పిదప అతడు పూర్తిగ కన్నుల విప్పి జూచినాడు.

"ఏమి, ఏమంటివి" అని ఆపాంథుడు ప్రశ్నించెను.

"బలి! బలి! బలి!" అని ఆవ్యక్తి సమాధానమిచ్చె.

"ఆఁ! ఆఁ!! ఆఁ!!! నన్నే-జాగ్రత్త" అని పాంథుడనె.

"ఏమి జాగ్రత్త. నన్నేమి చేసెదవు జాగ్రత్తను" అని వ్యక్తి ప్రశ్నించెను.

"అయితే రా! రా!! రా!!!" అని ఆపాంథుడనెను.

"ఎక్కడికి" అని వ్యక్తి.


"నాతో బలికి" పాంథుడు.

"ఎక్కడికో యెందులకు" వ్యక్తి.

"నడువుము. తెలియునా!!" పారుడు.

"నన్నే! నన్నే! ఆజ్ఞాపించుచున్నావా!" వ్యక్తి.

"ఆఁ నీవు చేయుచున్న విషయము శ్లాఘనీయమేనా? ఎన్ని హత్యలు! ఎంత దారుణము! నిన్ను వదలుదునా! రమ్ము. రమ్ము. మీ యింటికి" అని పారుడు కన్ను తెఱచేసి నిముష మాత్రము జూచెను. వ్యక్తి లోబడెను. ముందు వ్యక్తి పిదప బోడి బాపనయ్య తిన్నగ నడిచిరి. వ్యక్తి తిన్నగ నొక్క-చోటికి బోయి నిలువబడెను. ఆ పారుడు లోనికి బోయి తలుపువేసి "ఇదిగో బలి చూడుము ఇక్కడ" అని త్రికోణాకారము గా మూడు గీతల గీచి కొన్ని యక్షరముల వ్రాసి ఆ వ్యక్తికి జూపెను. ఆవ్యక్తి యిష్టపడక కష్టముమీద చూచెను. అంతే ఆ మాంపు యిప్పటివరకు నంతే. తిరిగి గ్రామము లోనికి రాలేదు. ప్రజల బాధింపలేదు. హత్య చేసిన వ్యక్తియే కంచి కామాక్షి. బోడి బాపనయ్యయే జగద్గురు శంకరాచార్య స్వాములవారు.



**ఇంద్రజాల మహేంద్రజాలము** ఈ గ్రంథములో జర్మనీగారడి, హస్తలాఘవము, ఆంగ్ల ఇంద్రజాలము, మంత్రశాస్త్రము, భూతవైద్యము, యంత్రములు, చీట్ల పేక తమాషాలు, వినోదవిద్యలు, మనుష్యుని మాయముచేయుట, మామిడిచెట్టును పుట్టించుట, జీవముతో సమాధి యగుట, శరీరము లేని తలచేత మాట్లాడించుట, గాలిలో మనుష్యుని నిలుపుట మొదలగు విచిత్రములున్నవి. దీనిచే మేజిక్ చేయగలరు. వెల రూ. 4.

చమత్కార గణితము:—(అపూర్వము) ఇందులో విచిత్ర వినోద మనోగణితములు, సమస్యలు, చిక్కు ప్రశ్నలు, యుక్తి తమాషాలెక్కలు, గణితావధానము గలవు. దీనిని చదివిన తెలివి కలుగును. వెల రూ. 1.

దొరకు వలయువారు **పి. ఆర్. జనార్దనం నాయుడు, ఒంగోలు** (గుంటూరు జిల్లా), అని వ్రాయుడు.